
వైభవం... గోదాదేవి కల్యాణం


జీయర్ స్వామి పర్యవేక్షణలో కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్న వేద పండితులు


కల్యాణ వేడుకలను తిలకిస్తున్న భక్తులు

వివరాలు 7వ పేజీలో



ఏం జరుగుతోంది..?

- జిల్లాపై టీడీపీ అధిష్ఠానం ఆరా
- కలకలం రేపిన తిక్కారెడ్డి కామెంట్స్
- దృష్టి సారించిన యువనేత నారా లోకేశ్
- నిఘా వర్గాల సమాచారం కోరిన సీఎంఓ

కర్నూలు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు తెలుగుదేశం పార్టీలో ఏదో జరుగుతోంది. తాజాగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్యాలకుర్తి తిక్కారెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలంరేపుతున్నాయి. ఇటీవల అంతర్గతంగా పార్టీలో జరుగుతున్న వ్యవహారాలపై టీడీపీ అధిష్ఠానం ఆరా తీస్తోంది. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు శనివారం పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా చెప్పుకునే వారు వ్యవహరిస్తున్న తీరు బాగోలేదంటూ ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'వైసీపీ హయాంలో టీడీపీ జెండా కోసం జైలుకు వెళ్లినోళ్లు.. రోడ్డుపై పోరాడినోళ్లు.. ఆర్థికంగా నష్టపోయినోళ్లు అక్కడే ఉన్నారు.. నిన్న మొన్న వచ్చిన వైసీపోళ్లు బాగుపడుతున్నారు.. వారికే పదవులు.. పనులు ఇస్తున్నారు.. ఇందు కోసమేనా యువనేత నారా లోకేశ పాదయాత్ర చేసింది.. ఇందుకోసమేనా అధినేత నారా చంద్రబాబు నాయుడు అవమానాలు భరించింది.. అక్రమ కేసులో జైలుకు వెళ్లి వచ్చింది. జిల్లాలో కొందరు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలుగా చెప్పుకునే వాళ్లు టీడీపీ జెండాలు మోసిన కార్యకర్తలు దగ్గర రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పైగా లంచాలు తీసుకొని రేషన్ షాపుల డీలర్‌షిప్పులు, పనులు ఇస్తున్నారు... మన కార్యకర్తల దగ్గరే లంచం తీసుకుంటే వారినేమనాలి..' అంటూ ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా తిక్కారెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఆయన మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కర్నూలు జిల్లాలో ఏం జరుగుతోందంటూ టీడీపీ అధిష్ఠానం ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఆ వ్యాఖ్యల్లో నిజమెంత.. అని సీఎంఓ(ముఖ్యమంత్రి కార్యాలయం) నుంచి నిఘా వర్గాలు (ఇంటిలిజెన్స్) ద్వారా సమాచారం సేకరించినట్లు సమాచారం. అదే క్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టి సారించినట్లు తెలిసింది. కర్నూలు జిల్లాలో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సమగ్ర వివరాలు ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరినట్లు సమాచారం. ఇదే అంశంపై ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో ముఖ్య నాయకులు జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డికి కూడా ఫోన్ చేసి సమాచారం అడిగినట్లు తెలిసింది.


శనివారం జరిగిన ఎన్టీఆర్ వర్ధంతిలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

ఆ వ్యాఖ్యలపై అసంతృప్తి.. సంతృప్తి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి చేసిన వ్యాఖ్యలపై కొందరు ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తే.. నిరాదరణకు గురైన సీనియర్ నాయకులు, కార్యకర్తలు 'ఆ మాటల్లో తప్పేముంది..' అంటున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులపై ప్రతిపక్ష పార్టీల నాయకులు అవినీతి ఆరోపణలు చేయడం సహజం. అధికార పార్టీకి చెందిన జిల్లా అధ్యక్షుడే తమ పార్టీలో కొందరు కార్యకర్తలతోనే లంచాలు తీసుకోవడం ఏమిటి..? అంటూ ప్రశ్నించడం కలకలం రేపుతోంది. తిక్కారెడ్డి వ్యాఖ్యలపై కొందరు ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఏ ఎమ్మెల్యే అయినా, ఇన్‌చార్జి అయినా అవినీతి అక్రమాలకు పాల్పడితే జిల్లా అధ్యక్షుడిగా అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లవచ్చని, ఇలా బహిరంగంగా మాట్లాడడం పార్టీకి నష్టం కాదా..? అంటూ ప్రశ్నించినట్లు సమాచారం. అయితే తిక్కారెడ్డి వ్యాఖ్యలను మాత్రం ఏ ఒక్కరూ బహిరంగంగా ఖండించకపోవడం కొసమెరుపు. ఐదేళ్ల కాలంలో వైసీపీ నాయకుల దౌర్జన్యాలను ఎదురొడ్డి రోడ్లపై పోరాడడమే కాకుండా అక్రమ కేసులు ఎదుర్కొని టీడీపీ అధికారంలోకి రావాలని, అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడాలని, తీవ్రంగా కష్టపడి.. అధికారం వచ్చాక ఎమ్మెల్యేలు నిరాదరణకు గురైన సీనియర్ నాయకులు, కార్యకర్తలు కొందరు తిక్కారెడ్డి వాఖ్యల్లో తప్పులేదని, ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఇన్‌చార్జిలు మారాలని, కష్టకాలంలో పార్టీ జెండా భుజాన మోసిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు, పనులు, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

ఆకట్టుకున్న అఖండ

- అంతరాష్ట్ర బండలాగుడు పోటీల్లో పాల్గొన్న వృషభం
- చూసేందుకు తరలి వచ్చిన ప్రజలు


ఎమ్మిగనూరులో జరిగిన ఎద్దుల బలప్రదర్శన పోటీల్లో పాల్గొన్న అఖండ సినిమాలో కనిపించిన ఎద్దు బసవ

ఎమ్మిగనూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర జాతర సందర్భంగా నిర్వహించిన ఒంగోలు ఎద్దుల బల ప్రదర్శన పోటీల్లో అఖండ సినిమాలో కనిపించిన వృషభం బసవ ఆదివారం ఆకట్టుకుంది. అరుణాచలంలో ఈ ఎద్దు దాదాపు నెల రోజులు షూటింగ్‌లో పాల్గొన్నట్లు తెలిసింది. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం మూదేడు గ్రామానికి చెందిన రైతు ఈ ఎద్దును ఏడెనిమిదేళ్ల క్రితం గార్లదిన్నె సంతకు తీసుకొచ్చారు. టీఎస్ఆర్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ అధినేత తోట శ్రీనివాసరావు (గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం కొప్పురావూరు గ్రామం) రూ.1.80 లక్షలకు కొనుగోలు చేశారు. ఆయన తన దగ్గర దాదాపు నాలుగేళ్ల పాటు ఉంచుకొని మరో ఎద్దుతో కలిపి ఆయా రాష్ట్రాల్లో జరిగే ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీల్లో నిలిపేవారు. అలా దాదాపు 30కి పైగా మొదటి బహుమతిని సాధించింది. ఏడాదిన్నర క్రితం తిరిగి అనంతపురం జిల్లా గార్లదిన్నె గ్రామానికి చెందిన రైతు కుమ్మరి రామాంజనేయులు ఆ వృషభాన్ని తోట శ్రీనివాసరావు నుంచి రూ.5.95 లక్షలకు కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 44 పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ బహుమతులను కైవసం చేసుకుంది. అఖండ సినిమాలో నటించిన ఎద్దు బసవ బండలాగుడు పోటీల్లో పాల్గొందని తెలుసుకున్న జనాలు భారీగా తరలి వచ్చారు. ఎద్దు బండలాగే ప్రదేశానికి రాగానే జై బాలయ్య అంటూ కేకలు, ఈలలు వేశారు. కాగా ఈ పోటీల్లో బసవ నాలుగు స్థానంలో నిలిచింది.

ఎద్దులంటే ఎంతో ఇష్టం

నాకు ఎద్దులంటే చాలా ఇష్టం. ఆరేళ్లుగా ఇలాంటి ఒంగోలు జాతి ఎద్దులను పోషించి పోటీల్లో నిలుపుతున్నా. అఖండ సినిమాలో ఎద్దును కూడా కొనుగోలు చేసి ఎంతో ఇష్టంగా పోషిస్తున్నాను. ఇప్పటి వరకు ఈ ఎద్దు మరో ఎద్దుతో కలిసి 44 పోటీల్లో పాల్గొనగా 26 ప్రథమ స్థానం బహుమతులను కైవసం చేసుకుంది.

-కుమ్మరి రామాంజనేయులు, రైతు, గార్లదిన్నె గ్రామం, అనంతపురం జిల్లా.


మైదానంలో బండలాగుతున్న ఎద్దులు

యోగి వేమన గొప్ప దార్శనీకులు

కలెక్టర్ రంజిత్ బాషా


యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలుగు సామాజ్యాన్ని చైతన్య పరిచిన మహాకవి యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త, దార్శనీకులని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. ఆదివారం యోగి వేమన జయంతి సందర్భంగా క్యాంపు కార్యాలయంలో యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో అత్యంత సులభంగా, తేలికైన పదజాలంతో రచించిన వేమన పద్యాలను అన్ని తరాల ప్రజలు అంగీకరించేలా ఉన్నాయని అన్నారు. పామరులు, పండితులను అలరించిన ఆయన కవిత్వం ఎంతో గొప్పదన్నారు. సమాజంలో ఉన్న దురాచారాలపై ఆనాడే తన పద్యాలతో సమాజంలో చైతన్యం రగిలించారన్నారు. వారి రచనల్లో మానవత్వంతో కూడా మిళితమై ఉందని, అలాంటి గొప్ప కవి గురించి స్మరించుకోవడం శుభపరిణామమన్నారు. ఆయన పద్యాలతో జీవిత సత్యాలను ప్రజలకు తెలియజేశారని, తెలుగు భాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని వివరించారు. సమాజ పరిస్థితులకు అద్దం పట్టేలా వేమన పద్య రచనలు సాగాయని, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి వేమన పద్యాలు ఎంతగానో దోహదపడుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి, ఇన్‌చార్జి సీపీవో భారతి, ఇన్‌చార్జి సెట్కూరు సీఈవో దీప్తి తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాలకు అన్యాయం
సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్
7
సాంఘిక నాటకాలతో సామాజిక పరివర్తన
సినీ, నాటక దర్శకుడు ఎస్‌కే మిశ్రో



భూ చిక్కులు తొలగేనా...?

- నేటి నుంచి మండలానికి ఒక గ్రామం పైలట్ ప్రాజెక్టుగా సర్వే
- నాలుగు నెలల్లో రీసర్వే పూర్తే లక్ష్యం
- కలవరపెడుతున్న రోవర్ల కొరత

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జగనన్న భూసర్వే-భూరక్ష పేరుతో గత వైసీపీ ప్రభుత్వం భూముల సర్వే చేపట్టి రైతుల జీవితాల్లో అల్లకల్లోలం నింపింది. ఎన్నెన్నో చిక్కులు కొత్తవి పుట్టుకు వచ్చాయి. కూటమి అధికారంలోకి రాగానే తమ భూ సమస్యలు తొలగిపోతాయని రైతులు ఆశలు పెట్టుకున్నారు. గత సంవత్సరం నవంబరు, డిసెంబరు నెలల్లో రెవెన్యూ సదస్సుల పేరుతో కూటమి ప్రభుత్వం గ్రామాల్లో రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. అయితే ఎన్నెన్నో సమస్యలు రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల నుంచి వెల్లువెత్తడంతో పూర్తి స్థాయిలో వాటిని సరిదిద్దే పరిస్థితి కనిపించడం లేదని ఆ విభాగాల అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పూర్తి స్థాయిలో రైతుల భూ వివాదాలకు చెక్ పెట్టాలని కూటమి ప్రభుత్వం భావించింది. సోమవారం నుంచి మండలానికి ఒక గ్రామం చొప్పున భూ సర్వే చేపట్టాలని రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 26 మండలాల పరిధిలో 25 గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద (కర్నూలు అర్బన్) తప్ప ఎంపిక చేశారు. అదేవిధంగా నంద్యాల జిల్లాలో 28 మండలాల్లో 28 గ్రామాలను ఎంపిక చేసి సర్వే చేపట్టనున్నారు. ఈ సర్వేను ఏప్రిల్ నెలాఖరుకు ముగించి రైతుల భూ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రెండు శాఖల అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ నెల 10వ తేదీ నుంచే ప్రభుత్వ భూముల్ని రీసర్వే చేసే కార్యక్రమం మొదలైంది. 20వ తేదీ నుంచి రైతులకు సంబంధించిన ప్రైవేటు, వ్యవసాయ భూములను రీసర్వే చేస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

రైతుల సమక్షంలోనే రీ సర్వే

ఉమ్మడి జిల్లాలో 921 గ్రామాలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 475, నంద్యాల జిల్లాలో 446 గ్రామాల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న భూరక్ష-భూసర్వే పేరుతో భూములను సర్వే చేశారు. అయితే అర్ధదిద్ధంగా ఈ సర్వే కార్యక్రమం కొనసాగడంతో రైతుల మధ్య చిచ్చు రేగింది. రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ఇప్పటికీ తమ భూ సమస్యలను పరిష్కరించాలని కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. అప్పట్లోనే కర్నూలు జిల్లాలో 255 గ్రామాల్లో, అదేవిధంగా నంద్యాల జిల్లాలో 211 గ్రామాల్లో భూసర్వే పూర్తయినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆదేశాలతో రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులు, సిబ్బంది రీసర్వేకు సిద్ధమవుతున్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. రైతుల సమక్షంలోనే వారి ఆమోదంతోనే రీసర్వే చేసేందుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. భూముల విస్తీర్ణం తగ్గిందని, హద్దులు మార్చేశారని, తనకు అందించిన హక్కు పత్రాల్లో తప్పులు దొర్లాయని రైతులు రెవెన్యూ అధికారుల వద్ద మొర పెట్టుకుంటూనే ఉన్నారు.

రోవర్ల కొరత.. సరిపడా ల్యాప్‌ట్యాప్‌లు ఏవీ..?

రీసర్వేకు రోజులు దగ్గర పడుతుండటంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలోగా రీసర్వేను పూర్తి చేస్తామో లేదోనని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. కర్నూలు జిల్లాలో 151 రోవర్లు సిద్ధం చేశారు. వాటిల్లో 5 నుంచి 10 రోవర్లు మాత్రమే సక్రమంగా లేవని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా నంద్యాల జిల్లాలో 188 రోవర్లకుగాను 38 రోవర్లు సక్రమంగా పని చేయలేదని, మరమ్మతులు చేయిస్తామని ఆ జిల్లా అధికారులు చెబుతున్నారు. ల్యాప్ ట్యాబ్‌లు కూడా పూర్తి స్థాయిలో పని చేయడం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గ్రామాల్లో ఏర్పాటు చేసిన సర్వే సిబ్బంది మండల, జిల్లా స్థాయిలోని అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో రీ సర్వే చేపట్టేందుకు ప్రభుత్వం అన్ని పరికరాలను సిద్ధంగా సమకూర్చితే తప్ప లక్ష్యం మేరకు సకాలంలో భూసర్వే పూర్తయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.

రైతుల భూచిక్కులు తొలగిస్తాం



ప్రభుత్వం ఆదేశించిన మేరకు ఈ నెల 20వ తేదీ నుంచి మండలానికి ఒక గ్రామంలో పూర్తి స్థాయిలో సర్వే చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. రోవర్లతోపాటు ల్యాప్‌ట్యాబ్‌లు సమకూర్చుకుంటున్నాం. సర్వేను రైతుల సమక్షంలోనే చేపడతాం. ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే పూర్తి చేస్తాం. - మునికన్నన్, సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ డీడీ


భూముల రీసర్వేకు వినియోగించే రోవరు

వైభవం.. గోదాదేవి కల్యాణం

- భక్త జనసంద్రమైన గోదాగోకులం
- సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



కల్యాణ వేడుకల్లో స్వామి, అమ్మవార్లు

కర్నూలు కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని మామిదాలపాడులో కొలువైన గోదా రంగనాథస్వామి దేవస్థానంలో శ్రీదేవి,భూదేవి సమేత రంగనాథస్వామివారి కల్యాణోత్సవం ఆదివారం కన్నులపండువగా సాగింది. ధనుర్మాస వ్రత మహోత్సవం పరిసమాప్తి సందర్భంగా గోకుల క్షేత్రంలో 'శ్రీగోదా రంగనాథ స్వామి కల్యాణోత్సవం', 'నిత్య కల్యాణ సేవ' ప్రారంభోత్సవం వైభవంగా నిర్వహించారు. గోకుల క్షేత్రంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలను తిలకించేందుకు కర్నూలు నగరంతోపాటూ వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు ఆనంద పారవశ్యంతో, వేడుకలను తిలకిస్తుండగా వేద



స్వామీజీలతో కలసి మాట్లాడుతున్న టీజీ వెంకటేశ్

మంత్రాల యుక్తంగా, శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అష్టాక్షరీ పీఠాధిపతి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ, త్రిదండి అష్టాక్షరీ బృందావన జీయర్ స్వామీజీ, త్రిదండి శఠగోప రామానుజ జీయర్ స్వామీజీ పాల్గొన్నారు. అష్టాక్షరీ పీఠాధిపతి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ పర్యవేక్షణలో, ఆలయ వేద పండితులు రమేష్ భట్టాచార్య, కిరణ్ భట్టాచార్య, సహాయకులు లక్ష్మీనారాయణ, మహేశ్వరాచార్యులు కల్యాణ వేడుకలను విశిష్టతను భక్తులకు తెలియజేస్తూ వీనుల విందుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్, పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్ పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, ఇతర ప్రతినిధులు ఐటీక్యాల పుల్లయ్య, పాలాది వెంకట సుబ్రహ్మణ్యం, మాకం శ్రీనివాస్, వేముల రవి, చిత్రాల వీరయ్య, వేణుగోపాల్, వేముల పవన్‌కుమార్, లింగం కృష్ణయ్య, భీమిశెట్టి ప్రకాశ్ తదితరులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కల్యాణ వేడుకల అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి - టీజీ వెంకటేశ్, రాజ్యసభ మాజీ సభ్యుడు

మన సంస్కృతి, సంప్రదాయాలను, భక్తి భావనలను భావితరాలకు అందించాలని, పిల్లలను ఆధ్యాత్మికత వైపు నడిపించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. గోదాగోకులంలో జరిగిన కల్యాణ వేడుకల్లో టీజీ వెంకటేశ్, టీజీ రాజ్యలక్ష్మి దంపతులు హాజరై పూజలు చేశారు. జీయర్ స్వాముల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు దైవిక మార్గాన్ని బోధించాలని, ఆలయాలకు తీసుకురావడం వల్ల వారిలో ఆధ్యాత్మిక, ధార్మిక భావనలు పెంపొంది, భవిష్యత్తులో విలువలతో జీవిస్తారని అన్నారు. భగవంతునికి భక్తులకు అనుసంధానకర్తలుగా గురువులు నిలుస్తారన్నారు. వారు లేనిదే ఇలాంటి బృహత్కర కార్యక్రమాలు లేవని, వారి ఆశీర్వాదాలు భక్తులపై ఎల్లవేళలా ఉండాలని అన్నారు. గోదా గోకుల క్షేత్రం ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోందని, నిర్వాహకుల కృషి అభినందనీయమన్నారు.

రాయలసీమలోనే గోకుల క్షేత్రానికి ప్రత్యేక స్థానం

గోదాగోకుల క్షేత్రం రాయలసీమ ప్రాంతంలోనే ఒక ప్రత్యేక స్థానం పొందిందని, గోదాదేవి వెలసిన ఈ క్షేత్రం భవిష్యత్తులో మరింత విశిష్టతను సంపాదించుకుంటుందని అన్నారు. భగవంతుడు మనకోసమే మనవెంట ఉంటూ రామ, కృష్ణ, నరసింహ, వామన ఇలా అనేక అవతారాలు దాల్చి మనవెనుకే తిరుగుతున్నాడని చెప్పారు. ఎలా ఆయన భూమండలంపై కారుణ్యరూపంలో వెలసిల్లాడో అలా లక్ష్మీదేవి అమ్మవారు కూడా ఆయన వెంట ఉంటూ భక్తులకు కరుణిస్తూ ఉంటారని చెప్పారు. టీజీ వెంకటేశ్, ఆయన తనయుడు మంత్రి టీజీ భరత్‌లు గోదాగోకుల క్షేత్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు.

- సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ, అష్టాక్షరీ పీఠాధిపతి

వెనుకబడిన ప్రాంతాలకు అన్యాయం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్



ప్రసంగిస్తున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

కర్నూలు కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన ప్రాంతాలకు అన్యాయం చేస్తున్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అన్నారు. సీపీఎం 27వ రాష్ట్ర మహాసభ, కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు తెలకపల్లి నరసింహయ్య 6వ వర్ధంతి సందర్భంగా నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం 'రాష్ట్ర సమగ్రాభివృద్ధి - ప్రత్యామ్నాయ విధానాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముందుగా తెలకపల్లి నరసింహయ్య చిత్ర పటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ అమరావతికి వేల కోట్ల రూపాయలు పెడతామంటున్నారని, అక్కడ కనీస వసతులు కల్పించి మిగిలిన అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరారు. గోదావరి నీళ్ల బానకచర్లకు తీసుకొస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు మతి తప్పి మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం చంద్రబాబు జిల్లాలో ప్రాజెక్టులు పూర్తిచేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయడం లేదని అన్నారు. జగన్ సీఎంగా ఉండి కూడా సీమ అవసరాలు ఎలా తీర్చాలో ఒక్క క్షణం కూడా ఆలోచించలేదని విమర్శించారు. ఉన్న ప్రాజెక్టులకు పంట కాలువలు నిర్మిస్తేనే ఉపయోగం ఉంటుందని సూచించారు.

సంపన్నుల అభివృద్ధే తప్ప సమగ్రాభివృద్ధి కాదు : తెలకపల్లి రవి

ప్రజల సొమ్మును వ్యాపారవేత్తలకు ధారాదత్తం చేయడమంటే సంపన్నుల అభివృద్ధి తప్ప సమగ్రాభివృద్ధి కాదని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, సీనియర్ జర్నలిస్టు తెలకపల్లి రవి అన్నారు. ప్రజలను అభివృద్ధి చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఏపీ అభివృద్ధి లోకేశ్, పవన్ అభివృద్ధిగా మారుతోందని విమర్శించారు. కట్టు కథలతో కూడిన అభివృద్ధి తప్ప నిజమైన అభివృద్ధి జరగడం లేదని, సమగ్రాభివృద్ధిపై దృష్టి ఉన్న వాళ్లు అమరావతి, పోలవరం మాత్రమే అభివృద్ధి చేస్తామని చెప్తారా అని ప్రశ్నించారు. రోడ్ల అభివృద్ధి పేరుతో టోల్ బాదుడు వేస్తే ఎవరు అభివృద్ధి చెందుతారని ఘాటుగా విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ వైద్య కళాశాలలో ఎస్ఎఫ్ఐలో పని చేస్తున్నప్పుడు నరసింహయ్య, గఫూర్, షడక్‌ల విప్లవ కార్యక్రమాల గురించి వివరించారు. విజన్ 2047 ప్రజా వ్యతిరేకంగా ఉందని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలు, నీటి ప్రాజెక్టులు, ప్రభుత్వ ఆసుపత్రుల గురించి ఇందులో ప్రస్తావన లేదని చెప్పారు. ఈ సదస్సులో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సీపీఎం అనంతపురం జిల్లా కార్యదర్శి ఒ.నల్లప్ప, తెలకపల్లి హరి, సీపీఎం జిల్లా నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాంఘిక నాటకాలతో సామాజిక పరివర్తన

సినీ, నాటక దర్శకుడు ఎస్‌కే మిశ్రో



ఎస్‌కే మిశ్రోను సత్కరిస్తున్న స్పెషల్ డీసీ కొండయ్య, రవీంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ జి. మోహన్‌కుమార్

కర్నూలు కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సామాజిక పరివర్తన కోసమే సాంఘిక నాటకాలు దోహదం చేస్తాయని ప్రముఖ సినీ, నాటక దర్శకుడు ఎస్‌కే మిశ్రో అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో 'వారం వారం సాంఘిక నాటకం' కార్యక్రమంలో భాగంగా విజయవాడ దృశ్యవేదిక సంస్థ వారి 'కనకపుష్యరాగం' సాంఘిక నాటకం ప్రదర్శించారు. ఈ నాటక ప్రదర్శనకు ముందు ఏర్పాటు చేసిన సభాకార్యక్రమంలో ఎస్‌కే మిశ్రో మాట్లాడుతూ సాంఘిక నాటకాలు సమాజంలోని రుగ్మతలను తెలియజేస్తూ, మనుషుల్లో ఒక సంస్కరణను తీసుకొని వస్తాయన్నారు. తాను అనేక తెలుగు చిత్రాల్లో నటించినా, రంగస్థలపై సాంఘిక నాటకాలపై ఆసక్తితో ఈ రంగంలోనూ ప్రదర్శనలు చేస్తున్నానని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ కొండయ్య మాట్లాడుతూ నాటకాలు సామాజిక మార్పునకు ఉపయోగపడతాయన్నారు. టీజీవీ కళాక్షేత్రం నిత్యం నాటకాలు ప్రదర్శిస్తూ ప్రేక్షకుల్లో చైతన్య భావాలను నింపుతోందని నిర్వాహకులను అభినందించారు. మరో అతిథి రవీంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ జి.మోహన్‌కుమార్ మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రం కళారూపాలకు నిలయమై, నిత్యం ఎందరో కళాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. నాటకాల ద్వారా ప్రజల్లో చైతన్యం కలుగుతుందని, ఆ దిశగా కృషి చేస్తున్న కళాకారులకు అభినందనీయమన్నారు. కథా రచయిత ఇనాయతుల్లా మాట్లాడుతూ నాటక దర్శకుడు మిశ్రో సిరివెన్నెల చిత్రంలో మంచి పాత్రలో ప్రేక్షకుల్ని మెప్పించారని, ఆయన కర్నూలు ప్రేక్షకులకు నాటకం ప్రదర్శించడం స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ సమన్వయ కర్తలు డి.ఈశ్వరయ్య, యాగంటీశ్వరప్ప, సీనియర్ నటుడు క్రిష్టవర్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సినీ, నాటక దర్శకుడు మిశ్రోను అతిథులు, కళాకారులు ఘనంగా సత్కరించారు. నాటక ప్రదర్శనకు కళాక్షేత్రం పక్షాన రూ.30వేలు పారితోషికం అందజేశారు.

యువతి అదృశ్యం కలకలం

- మాజీ ఎమ్మెల్యే శిల్పా ఇంటి వద్ద తల్లిదండ్రుల నిరసన
- మాజీ కౌన్సిలర్ అనుచరుడు ఎత్తుకెళ్లాడని ఆరోపణ

నంద్యాల, జనవరి 19, (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యం ఘటన నంద్యాల జిల్లా కేంద్రంలో కలకలం రేపుతోంది. వైసీపీకి చెందిన ఓ మాజీ కౌన్సిలర్ ప్రధాన అనుచరుడే తమ కుమార్తెను ఎత్తుకెళ్లారని యువతి తల్లిదండ్రులు పేర్కొనడం దుమారం రేపుతోంది. మూడు రోజుల కిందట ఘటన జరగగా ఆదివారం వైసీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా ఇంటి వద్ద వారు నిరసనకు దిగడం చర్చనీయాంశంగా మారింది. బాధితులు, పోలీసుల వివరాల మేరకు.. నగర శివారులోని నందమూరి నగర్‌లో శివకుమార్, పద్మావతిలు నివాసం ఉంటున్నారు. వీరి కుమార్తె నగర శివారులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతోంది. సంక్రాంతి సెలవులు కావడంతో ఇంటి వద్దనే ఉంటోంది. ఈ క్రమంలోనే ఈ నెల 17వ తేదీన 39వ వార్డుకు చెందిన వైసీపీ మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ ప్రధాన అనుచరుడు జయసాయి ఆ యువతిని ఎత్తుకెళ్లాడు. ఈ మేరకు యువతి తల్లిదండ్రులు అదే రోజు సాయంత్రం మాజీ వైసీపీ కౌన్సిలర్‌తోపాటు జయసాయి, అతని తల్లి ఈశ్వరిలపై నంద్యాల తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు మాత్రం ఈ నెల 18వ తేదీన అదృశ్యం కేసుగా నమోదు చేశారు. ఈ క్రమంలోనే యువతి తల్లిదండ్రులు ఆదివారం పట్టణంలోని మాజీ వైసీపీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఇంటి ఎదుట నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని సర్ది చెప్పారు. ఇదిలాఉంటే ఇదే జయసాయి గతంలో సదరు యువతి 10వ తరగతి చదివే సమయంలో బలవంతంగా ఇంటి నుంచి ఎత్తుకెళ్లాడని తెలుస్తోంది. దీంతో అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని సమాచారం.



వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఇంటి ముందు ఆందోళన చేస్తున్న యువతి తల్లిదండ్రులు

లారీ, బైకు ఢీ.. ఒకరి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

తుగ్గలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి విశ్వం దాబా సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాలివీ.. అనంతపురం జిల్లా పెరుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన కృష్ణ(35), అనంతపురానికి చెందిన గోవింద్ పగిడిరాయి గ్రామంలో పెయింట్ వర్క్ చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఆదోనిలో పెయింటింగ్ తీసుకుని పగిడిరాయి వెళ్తుండగా లారీ, బైకు ఢీకొన్నాయి. కృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా.. గోవిందుకు తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ వైద్యశాలకు తరలించారు. గోవింద్‌ను వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. కృష్ణకు భార్య తిమ్మక్క, కొడుకు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ముగ్గురిపై జీరో ఎఫ్ఐఆర్

ఆదోని రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలం బురుజులకు చెందిన రామకృష్ణారెడ్డి, రంగమ్మ, రఘునాథ్‌పై ఇస్వీ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేశారు. ఎస్ఐ నాగేంద్ర తెలిపిన వివరాలివీ.. బురుజులకు చెందిన రామకృష్ణారెడ్డి పప్పు శనగల వ్యాపారం చేసేవారు. 2021లో అదే గ్రామానికి చెందిన కురువ రాముడు వద్ద రూ.12 లక్షలు విలువ చేసే శనగలను విక్రయించి డబ్బు చెల్లించకపోవడంతో పాటు గ్రామం వదిలి భార్య రంగమ్మ పుట్టినిల్లు పెద్దహరివాణం గ్రామానికి మకాం మార్చారు. రాముడు డబ్బులు చెల్లించాలని అడగడంతో ఆయనపై ముగ్గురు తిరగబడ్డారు. దీంతో రాముడు ఫిర్యాదు మేరకు ముగ్గురుపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసును పత్తికొండకు ట్రాన్స్‌ఫర్ చేశామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కౌతాళం మండలం కుంటనహాళ్‌కు చెందిన లింగప్ప(19) కర్నూలులో చికిత్స పొందుతూ మృతి చెందారు. పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపిన వివరాలివీ.. ఈనెల 16వ తేదీన పొలానికి వెళ్తున్న లింగప్ప హనవాళ్ వద్ద బైకు అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే కోలుకోలేక ఆదివారం మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

- 21 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక
- పర్ల జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వారందరూ ఒకచోట కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరింపులు.. గత స్మృతులను తలుచుకుంటూ నవ్వులు, ఆనందంగా గడిపారు. కలిసి చదివిన పాఠశాలలో 21 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలుసుకున్న అపూర్వ ఘట్టానికి కల్లూరు మండలంలోని పర్ల హైస్కూల్ వేదికగా నిలిచింది. 21 సంవత్సరాల తర్వాత కలుసుకున్న 2003-2004 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల అలనాటి జ్ఞాపకాలివి. ఆదివారం పర్ల జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, జీవన మార్గాన్ని చూపిన పాఠశాలను చూసుకునేందుకు ఈ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ప్రస్తుత పర్ల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ద్వారకానాథ శాస్త్రి, సంపత్‌కుమార్, మీనాక్షినాయుడు, నగేష్, కల్పన, గౌరీ పద్మజ, జ్యోతి, గోదాదేవి, ఈ.పాండురంగయ్య, శ్రీధర్‌బాబులు హాజరయ్యారు. వారిని పూర్వ విద్యార్థులు పుష్పమాలలు, శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులైన ఉప్పర అశోక్‌కుమార్, బి.అయ్యస్వామి, కేపీ మధుశేఖర్, ఉపేంద్ర, శివ, సుధాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, షేక్షావలి, రంగారెడ్డి, యు.సురేష్, టి.లక్ష్మన్నలతోపాటూ సుమారు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం దాకా ఉత్సాహంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఉపాధ్యాయులతో కల్లూరు మండలం, పర్ల గ్రామ జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

చాలా ఆనందంగా ఉంది



పర్ల పాఠశాలలో నేను 1997-2003 మధ్య తెలుగు పండిట్‌గా పనిచేశాను. అప్పట్లో విద్యార్థుల చదువుపై దృష్టి పెట్టి, ప్రతి విద్యార్థి బాగా చదువుకోవాలని, ఉన్నత స్థితికి చేరుకోవాలనే లక్ష్యంగా బోధించేవాళ్లం. చాలా మంది విద్యార్థులు ఎంతో ఆసక్తిగా చదువుకొనేవాళ్లు. అలాగే వృద్ధిలోకి వచ్చి మమ్మల్ని గుర్తించి సత్కరించడం చూస్తే గురువులకు ఇంతకన్నా సంతృప్తి మరెందులోనూ ఉండదు అనిపిస్తుంది. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి. పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు మంచి లక్ష్యంతో ముందుకెళ్లాలి.

- ఈ.పాండురంగయ్య, విశ్రాంత హెచ్ఎం, కర్నూలు

క్రమశిక్షణే ఈస్థాయికి చేర్చింది

మాది కె.నాగలాపురం వద్దగల బూడిదపాడు. 2003-2004లో పది ఔటింగ్ బ్యాచ్. చాలా మంది విద్యార్థులు ఈ స్కూల్‌లో చదువుకుని ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నారు. అంతా వృద్ధిలోకి వచ్చిన వాళ్లమే. నైతిక విలువలు, సమాజం పట్ల గౌరవభావాలు, బాధ్యతలు మా గురువులు నేర్పించారు. అందుకే ఈ స్థాయికి చేరుకోగలిగాం. విద్యార్థులకు బాగా చదువు రావాలన్న భావనతో వారు కొట్టినా, దండించినా అది మా భవిష్యత్తుకు ఉపయోగపడేలా నిలిచింది.



- బి.అయ్యస్వామి, పూర్వ విద్యార్థి

మద్దతు ధర ఏదీ?

● గిట్టుబాటు ధర లేక వరి రైతు దిగాలు
● యంత్రాలతోనే వరి కోతలు


రైతు సాగు చేసిన వరి పంట

ఓర్వకల్లు జనవరి 19, (ఆంధ్రజ్యోతి): వరికి మద్దతు ధర కరువైంది. దీంతో ధాన్యాన్ని కల్లాల్లో, ఇళ్లల్లో, గోడౌన్లలో నిల్వ చేసుకున్నారు. కొందరు రైతులు దళారులు అడిగిన కాడికి విక్రయిస్తున్నారు. పెట్టుబడులు పెరిగినా రాబడి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతు పండించిన ప్రతి ధాన్యాన్ని మద్దతు ధర కల్పిస్తుందని చెప్పినప్పటికీ ప్రకటనలకే పరిమితమయ్యాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఓర్వకల్లు మండలంలోని ఓర్వకల్లు, కాల్వ, కొల్లుబుగ్గ, హుసేనాపురం, కన్నమడకల, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో 3వేల ఎకరాలకు పైగా వరి పంట సాగు చేశారు. దిగుబడి బాగా వచ్చినా మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు పెట్టుబడి రూ.20వేలు పైగా పెట్టారు. అయితే బస్తా రూ.1200లకు పలుకుతోంది.

● యంత్రాలకు భలే డిమాండ్

రైతులు సాగు చేసిన వరి పంటను తొలగించేందుకు యంత్రాలకు భలే డిమాండ్ పెరిగింది. గంటకు యంత్రానికి రూ.2వేలు చెల్లిస్తున్నారు. యంత్రం రోజుకు పదెకరాల కోత కోస్తుందని రైతులు తెలిపారు. యంత్రాలకు కూడా భలే డిమాండ్ ఉంది. కూలీలు దొరక్కపోవడంతో రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు.


యంత్రం ద్వారా వరి కోత

● దిగుబడి బాగా వచ్చింది...



ఈ ఏడాది వర్షాలు బాగా కురిసాయి. గత మూడేళ్ల నుంచి వర్షాలు లేవు. పంటలు లేక పశుగ్రాసానికి ఇబ్బంది పడ్డాం. ఈ ఏడాది పంటలు బాగా పండినా గిట్టుబాటు ధర లేదు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలి.
- ఫనయ్య, రైతు

● అమ్ముకుంటే నష్టం



తనకున్న మూడెకరాల పొలంలో వరి సాగు చేశాను. పెట్టుబడి కింద రూ.90వేలు ఖర్చు చేశా. ప్రస్తుతం వరి బస్తా రూ.1200 కంటే ఎక్కువ లేకపోవడంతో అమ్ముకుండా ధాన్యాన్ని ఆరబెట్టుకుని కాపలా కాస్తున్నా. ఈ ధరకు అమ్ముకుంటే నష్టం వస్తుంది. చేసిన కష్టానికి ఫలితం ఉండదు.
- శ్రీనివాసులు, రైతు

● నష్టాల్లో అన్నదాతలు



వరి ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల రైతులు కష్టాలు పడుతున్నారు. తక్కువ ధరకు అమ్మలేక ధర ఎప్పుడు పెరుగుతుందో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. కల్లాల్లో, ఇళ్ల బయట ధాన్యాన్ని ఆరబెట్టుకుని పగలు, రాత్రి కాపలా కాయాల్సిన పరిస్థితి నెలకొంది. క్వింటం రూ.1500 మించి పలకడం లేదు.

● గిట్టుబాటు ధర కల్పించండి



రైతులు పండించిన వరిధాన్యానికి ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించాలి. రూ.1200ల కంటే ఎక్కువ ధరకు కొనుగోలు కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఎకరాకు 25 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి బాగా వచ్చినా ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. - గోవిందరెడ్డి, రైతు



డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలను నియమించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న ఉప విద్యాశాఖ అధికారుల పోస్టులు, మండల విద్యాశాఖ అధికారుల పోస్టులను ఉమ్మడి సీనియారిటీతో ఎస్సీ, ఎస్టీలుగా నియమించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్వీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ధనుంజయ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పీఆర్టీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఉప విద్యా శాఖ అధికారుల పోస్టులను, గవర్నమెంటు వారిని ఎఫ్ఏసీలుగా నియమిస్తూ జోన్-2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం సరైంది కాదని, కామన్ సీనియారిటీతో అర్హులైన వారికి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు రవిప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్లు బాబురావు, సుదర్శనం, ఆదినారాయణ రెడ్డి, రమణయ్య, మల్లయ్య, శ్రీను, లక్ష్మీనారాయణ, వీరారెడ్డి, నాగేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ట్రెజరీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ట్రెజరీ, లెక్కల సర్వీసు అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసులు, వేణుగోపాల్ ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా ట్రెజరీ, లెక్కల సర్వీసు అసోసియేషన్ ఎన్నికలను కుప్పస్వామి చెన్నకేశవులు, మోహన్ కుమార్, సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాయ అధ్యక్షుడిగా సుబ్బరాయుడు, ఉపాధ్యక్షులుగా చిన్నయ్య, భార్గవి షేక్ దిల్షాద్, ట్రెజరర్‌గా మహ్మద్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా మధుశేకర్, జాయింట్ సెక్రటరీలుగా ప్రకాష్, నాగార్జున ఎన్నికయ్యారు.

ద్వంద శాఖల నియంత్రణ రద్దు చేయాలి

● అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీలావతి

కర్నూలు న్యూసిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయంలో ఆరోగ్య కార్యదర్శుల ద్వంద శాఖల నియంత్రణ తక్షణమే రద్దు చేయాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.లీలావతి డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో లీలావతి మాట్లాడుతూ సచివాలయాల్లో పని చేస్తున్న గ్రేడ్ 3 ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించడలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఏఎన్ఎంలు ఆరోగ్య శాఖకు ఆన్‌లైన్ ఉద్యోగులుగా ఉన్నప్పటికీ పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన పనులు కూడా చేయించడం వల్ల ఒత్తిడి పెరుగుతుందన్నారు. పీహెచ్‌సీలలో మాతా శిశు సంరక్షణ వంటి పనులు చేయాల్సిన కార్యదర్శులు పంచాయతీరాజ్ శాఖలో జియో యాప్స్ హౌస్ హోల్డ్ సర్వే అనే యాప్‌లలో డేటాతో పాటు 1న పెన్షన్ చెల్లింపులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జే.లలితమ్మ, జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, టి.రామాంజనేయులు, వనజ పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగ పోటీల పోస్టరు విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు న్యూసిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రయోగ పోటీల పోస్టరును విడుదల చేశారు. ఆదివారం వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, తెలకపల్లి రవి, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్ వేదిక కార్యాలయంలో ఆవిష్కరించారు. గేయానంద్ మాట్లాడుతూ ఈ పోటీలలో 8,9,10వ తరగతి విద్యార్థులు అర్హులన్నారు. ఐదు నిమిషాల నిడివి ఉన్న ప్రయోగ వీడియోలను ఫిబ్రవరి 15లోగా రాష్ట్రంలోని వేదిక కేంద్రానికి పంపాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షకార్యదర్శులు సుధీర్, ఖాజాహుస్సేన్, రవికుమార్, నవీన్ పాల్గొన్నారు.

నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలి


రాస్తారోకో చేస్తున్న వామపక్ష నాయకులు

కోడుమూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నియంత్రణకై కర్నూలు నుంచి కోడుమూరు వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని ఆదివారం సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. సీపీఎం కామార్తి రాజు మాట్లాడుతూ గడిచిన 20 రోజుల్లో ప్యాలకుర్తి, కొత్తూరు గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదాల కారణంగా అరుగురు మృతి చెందగా, దాదాపు 10 మంది వరకు తీవ్ర గాయాల పాలయ్యారు. ప్రభుత్వం స్పందించి నాలుగు లైన్ల రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. స్థానిక కోట్ల సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టడం వలన ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కార్యక్రమంలో నాయకులు గఫూర్‌మియా, వీరన్న, లక్ష్మన్న, బుడ్డన్న, రాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాహితీవేత్తలు సామాజిక ప్రేమికులు కావాలి

- క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్

కర్నూలు కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సాహితీవేత్తలు సామాజిక ప్రేమికులు కావాలని క్లస్టర్ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. ఆదివారం నగరంలోని మద్దూరు నగర్‌లోగల పింగళి సూరన తెలుగుతోట సమావేశం హాలులో కర్నూలుకు చెందిన విశ్రాంత ఆంగ్లోపన్యాసకురాలు, కథా రచయిత్రి డాక్టర్ మీరా సుబ్రహ్మణ్యం రాసిన 'చీకటిలో వేకువలో', 'ది కేజ్...అండ్ ది అదర్ స్టోరీస్' పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. క్లస్టర్ యూనివర్సిటీ, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ మాట్లాడారు. సమాజ హితవు, కుటుంబాల్లో ఉండాల్సిన బాంధవ్యాలు, వైవిధ్య భరితమైన జీవిత సారం ఇలా అనేక అంశాలను తన కథల్లోకి ఒలికించిన సామాజిక ప్రేమికురాలు రచయిత్రి మీరాబాయి అని ప్రశంసించారు. నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం (నరసం) జిల్లా అధ్యక్షురాలు కా.వెం. సుబ్బలక్ష్మమ్మ మాట్లాడుతూ రచయిత్రి అనుభవాలను, అనేక వ్యక్తిత్వాలను తన రచనల్లో పాత్రలుగా మలిచారని అన్నారు. సమీక్షకులు డాక్టర్ ఫరీదా, డాక్టర్ కె. చంద్రమౌళిని మాట్లాడుతూ టీఎస్ఏ కృష్ణమూర్తి లాంటి ప్రసిద్ధ నవలా రచయిత ప్రశంసలు అందుకున్న మీరాబాయి కథలన్నీ గుండెను తట్టిలేపే విధంగా ఉంటాయని, ఆలోచనాత్మకంగా సాగుతాయని అన్నారు. కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ మాట్లాడుతూ చక్కటి శైలితో, వాస్తవ జీవితాన్ని ఆనందమయం చేసుకోవడానికి తగిన పరిస్థితులను కల్పించుకోవడానికి రచయిత్రి తన కథల్లో సూచిస్తారని చెప్పారు. సభకు గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర అధ్యక్షత వహించగా, నరసం జిల్లా కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి సమన్వయ కర్తగా వ్యవహరించారు. సభలో సాహితీవేత్తలు తంగిరాల సుబ్రహ్మణ్యం, జేఎస్ఆర్‌కే శర్మ, ఎలమర్తి రమణయ్య, ఆరేపల్లి వరలక్ష్మమ్మ, ఎం. లక్ష్మయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మీరా సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య


కలెక్టరేట్ ముందు నిరసన చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు న్యూసిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. అమిత్‌షా ఏపీ రాష్ట్ర పర్యటన నిరసిస్తూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఆదివారం కలెక్టరేట్ ఎదుట గో బ్యాక్ అమిత్ షా నినాదంతో ప్లే కార్డ్స్ పట్టుకుని నిరసన తెలిపారు. గిడ్డయ్య మాట్లాడుతూ ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత, భారతదేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన అంబేడ్కర్ పార్లమెంటు సాక్షిగా అవమానపరచడం దారుణమన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు తీవ్ర ఆందోళన చేస్తున్న ప్రధాని మోదీ స్పందించకపోవడం అమిత్‌షాకు మద్దతు ఇస్తున్నట్లు స్పష్టం తెలుస్తుందన్నారు. అమిత్‌షా క్షమాపణ చెప్పాకే రాష్ట్రంలో పర్యటించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, కార్యవర్గసభ్యులు కే.జగన్నాథం. మహేష్, ఏఐవైఎఫ్,ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మారథాన్ వాక్


మారథాన్ వాక్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ మహబూబ్ బాషా

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ గేటు ముందు నుంచి రన్ ఫర్ హెల్త్ నేషన్ అనే నినాదంతో ఆదివారం సంకల్ప కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మారథాన్ వాక్‌ను ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్ బాషా జిల్లా ఒలంపిక్ అధ్యక్షులు రామాంజనేయులు ప్రారంభించారు. దేశ సమైక్యత, సోదరా భావంతో మెలగాలని కోరుతూ చేసిన మారథాన్ వాక్ నగర ప్రజలకు స్ఫూర్తినివ్వాలని డీఎస్పీ కోరారు. కార్యక్రమంలో సంకల్ప కమిటీ ప్రతినిధులు మహావీర్, చిరంజీవి, నికిల్, సునీత, సోనీ, వీణ రాకేష్, భవన, ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధి కొండేపోగు చిన్న సుంకన్న, రైఫిల్ షూటింగ్ ఉపాధ్యక్షులు కరీముల్లా, ఎంఎండీ బాషా పాల్గొన్నారు.

హాకీ టోర్నమెంటు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో నెహ్రూ మెమోరియల్ పూర్వ విద్యార్థులు రాము, త్రినాథ్, ఈశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాకీ టోర్నమెంటును డా.ప్రశాంతి శ్యాం ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 నేషనల్ పోటీలకు ఎంపికైన బి.ధీరజ్ కుమార్‌ను అభినందించారు. కొత్త స్టిక్కింగ్, బ్యాగ్, షూస్, క్రీడా పరికరాలు డా.ప్రశాంతి ధీరజ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ వ్యాయామ అసిస్టెంట్ డైరెక్టర్ డా.కేకే శివకిషోర్, సీనియర్ హాకీ క్రీడాకారుడు మాధవరావు, సీనియర్ హాకీ క్రీడాకారుడు సత్యకుమార్, ఆదినారాయణ, రసూల్, సుదర్శన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ఏ నాయకులకు సత్కారం

కర్నూలు కలెక్టరేట్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాజేష్‌లను ఆదివారం జిల్లా ఏపీఆర్ఎస్ఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, లక్ష్మీరాజు సత్కరించారు. ప్రభుత్వం రాష్ట్రంలోని ఆర్ఐఎస్ డిప్యూటీ తహసీల్దార్లను తిరిగి రెండు సంవత్సరాలు కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చేందుకు కృషి చేసిన సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

22న అధ్యాపకుల ఆందోళన

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): డీపీసీ జీజేఎల్ఏ ఆధ్వర్యంలో ఈ నెల 22న విజయవాడలో అధ్యాపకులు సత్యాగ్రహ మౌన దీక్ష చేపట్టనున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గురువయ్య, రాష్ట్ర జనరల్ సెక్రటరీ దేవరకొండ మురళీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యాపకులకు జరుగుతున్న అన్యాయంపై సత్యాగ్రహ మౌన దీక్షకు పిలుపునిచ్చామన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అధ్యాపకులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

కోడుమూరు రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. కళాశాలలో 2012-14 బ్యాచ్ విద్యార్థులు తమ గురువులను ఆహ్వానించి సన్మానించారు. ముందుగా కళాశాల ప్రధాన గేటు నుంచి అప్పటి అధ్యాపకులు రవిప్రభాస్, మాధవరావు, లలిత, హేంద్రాడ్స్, ప్రకాష్, రమేష్, మధుసూదన్‌రావు, నారాయణ, వెంకటరమణ, హనుమంతరావులపై పూలవర్షం కురిపిస్తూ ఆహ్వానించారు. అనంతరం విద్యార్థులు తమ అనుభవాలను నెమరేసుకున్నారు. ఉన్నతికి తోడ్పడిన గురువులను ఎన్నడూ మరువబోమని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో అధ్యాపకులను దుశాలువా, పూలమాలలతో సత్కరించారు. కళాశాల అభివృద్ధికి ఎల్లవేళలా సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు శేఖర్, మధు, రామచంద్రుడు, విశ్వనాథ్, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ గర్జనను విజయవంతం చేయాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

కోడుమూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాయలసీమ మాలల యుద్ధ గర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు నాయకులు ఓబులేసు అన్నారు. స్థానిక చెన్నకేశవ దేవాయలయంలో ఆదివారం మాలమహానాడు నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. వర్గీకరణ అమలును వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. మాలల హక్కుల సాధనకు పోరాటం చేపట్టాలని పిలుపు నిచ్చారు. ఫిబ్రవరి 23న కర్నూలోని ఎస్టీబీసీ మైదానంలో జరిగే బహిరంగ సభకు మాలలు పెద్ద ఎత్తున కదలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మునిస్వామి, రాంమోహన్, మద్దిలేటి, రమాంజనేయులు, సింగరయ్య, రాజు, దాసు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర విభాగాల్లో బెడ్ల కొరత


మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు

కర్నూలు హాస్పిటల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అత్యవసర విభాగమైన క్యాజువాల్టీ, ఏఎంసీ, సర్జికల్, ఐసీయూలో బెడ్ల కొరతతో రోగులు ఇబ్బంది పడుతున్నారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సీఆర్ భవన్‌లో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన రోగులకు క్యాజువాల్టీ, ఏఎంసీ, సర్జికల్ ఐసీయులో మెరుగైన సేవలు అందడం లేదన్నారు. గత వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా తలకు గాయమై క్యాజువాల్టీకి రాగా, రోగికి మూడు రోజులైన సర్జికల్ ఐసీయూలో బెడ్ దొరక్క క్యాజువాల్టీలో చికిత్స అందించడం జరిగిందన్నారు. సర్జికల్ ఐసీయూలో ఆరు పడకలు ఉండగా.. నాలుగు మాత్రమే పని చేస్తున్నాయన్నారు. యాక్సిడెంట్లు, క్రిమిసంహారక మందులు సేవించి ప్రమాదాలకు గురైన క్షతగాత్రులు క్యాజువాల్టీకి వస్తే వారిని లోపలికి తీసుకెళ్లడానికి స్ట్రెచర్లు, వీల్ చైర్లు లేక గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారన్నారు. అత్యవసర రోగులకు త్వరగా చికిత్స లభించకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్లి లక్షల బిల్లు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆసుపత్రి అధికారులు నిర్లక్ష్యాన్ని వీడనాడి రోగులకు మెరుగైన సేవలు, బెడ్ల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బీసన్న, నాయకులు కృష్ణ బాబయ్య, రామాంజిగౌడు, రవి, శివ, రాంబాబు, మహేష్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఆధ్యాత్మిక విలువలు నేర్పించాలి

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్


కలశయాత్రను ప్రారంభిస్తున్న టీజీ వెంకటేష్

కర్నూలు కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నేటితరం చిన్నారులకు ఆధ్యాత్మిక విలువలు, నైతిక విలువలు నేర్పించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం పాతనగరంలోని రాంబొట్ల దేవాలయం వద్ద, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ, గురు వాసవి శేషగిరిశెట్టి ఆధ్వర్యంలో 108 మంది కన్యలతో కలశయాత్ర నిర్వహించారు. టీజీ వెంకటేష్ మాట్లాడుతూ గత 27 ఏళ్లుగా వాసవీ మాత దీక్షమాలను ధరిస్తూ అమ్మవారి కృపకు పాత్రులు కావడం అభినందనీయమన్నారు. ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకాలతో కలశ జలాలతో అభిషేకించారు. సాయంత్రం ప్రత్యేక దీపాలంకరణ, మంగళహారతి నిర్వహించారు.

'రహదారి విస్తరణ చేపట్టవద్దు'


మాట్లాడుతున్న పుల్లారెడ్డి

కర్నూలు న్యూసిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని 5 కాలనీల నివాస భవనాల మీదుగా మంజూరు చేసిన 60 అడుగుల రోడ్డును రద్దు చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బాలాజీ నగర్ వద్ద కాలనీవాసులతో కలిసి నిరసన చేపట్టారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ ప్రేమ్‌నగర్, లక్ష్మణ్‌సింగ్ కాలనీ, పోస్టల్ కాలనీ, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నగర్, బాలాజీనగర్ మీదుగా జాతీయ రహదారి వరకు 20 నుంచి 40 అడుగుల రోడ్డు మాత్రమే ఉందన్నారు. అయితే 60 అడుగుల రోడ్డు ఎలా వేస్తారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు ఎం.వరప్రసాద్, జి.పుల్లారెడ్డి, కే.నాగేశ్వరరావు, ఎస్.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయండి


కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

కర్నూలు న్యూసిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కార్మికులు సాధించుకున్న హక్కులను భంగం కలిగించే విధంగా మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌ను త రద్దు చేయాలని సీఐటీయూ,సీపీఎం,రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక కర్షక ఐక్యత దినం పురస్కరించుకుని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ రైతు పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ దల్లేవాలా అనే రైతు 55 రోజులుగా నిరవధిక దీక్షలు చేయడంతో ఆయన ఆరోగ్యం క్షీణించిందన్నారు. సమస్యలు పరిష్కరించాలని మరో 111 మంది మూడు రోజులుగా నిరవధిక దీక్షలు చేపట్టినా పాలకులకు చీమకుట్టినట్లు లేదన్నారు. మోదీ ప్రజావ్యతిరేక విధానాలపై కార్మిక, కర్షకులు, ప్రజలు ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు అబ్దుల్‌దేశాయ్, సీహెచ్.సాయిబాబు, సుధాకర్పప్ప, ఏసు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల పునర్వికాసానికి పోరాటాలు

కర్నూలు కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల పునర్వికాసానికి పోరాటాలు చేయాలని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద అన్నారు. ఆదివారం నగరంలోని విశాలాంధ్ర కార్యాలయంలో అసరం జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేసి వాటి అమలుకు కార్యాచరణ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో అరసం గౌరవ సలహాదారుడు డాక్టర్ ఎం. హరికిషన్, అరసం ప్రతినిధులు షుల్లా రామాంజినేయులు, కేసీ మల్లికార్జున, సోమ భూపాల్, వెంకట రాముడు, వెంకటేష్, రాజా రమేష్, నగర ప్రధాన కారదర్శి ప్రమోద్ చక్రవర్తి పాల్గొన్నారు.

హరికిషన్‌కు పురస్కారం

కర్నూలు కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన బాల సాహితీవేత్త, సామాజిక మాధ్యమాల కథల ప్రచారకుడు డాక్టర్ ఎం. హరికిషన్ చిత్తూరు జిల్లా పలమనేరులో 'చిన్న బుచ్చినాయుడు పురస్కారం' అందుకున్నారు. శనివారం రాత్రి పలమనేరులోని కళామందిరంలో ఏర్పాటు చేసిన సాహిత్య సభలో ఈ పురస్కారం అందించి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, ప్రముఖ శతావధాని ఆముదాల మురళి, నిర్వాహక సంస్థ అధ్యక్షుడు తులసీనాథ్, తిరుపతి, చిత్తూరు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ముంచిన శనగ

- దిగుబడి రాక రైతుల ఆవేదన
- దెబ్బతీసిన తుఫాన్
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి


నిల్వ ఉన్న శనగ దిగుబడి

మద్దికెర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 గ్రామాల్లోని 18వేల ఎకరాల్లో శనగను సాగు చేశారు. మొదట్లో వాతావరణం అనుకూలించడంతో ఇంకే ముంది మంచి దిగుబడి వస్తుందని రైతులు సంతోషించారు. అక్టోబరు, నవంబరు మొదటి వారంలో వర్షాలు బాగా కురవడంతో పడటంతో సాగు చేశారు.

వెంటాడిన తుఫాన్, వాతావరణం

డిసెంబరు వరకు పంట బాగా ఎదిగింది. దిగుబడి ఆశాజనకంగా వస్తుందని అన్నదాతలు ఆశించారు. అయితే డిసెంబరు 2వ వారంలో తుఫాన్ ప్రభావంతో పంట దెబ్బతింది. ఇందుకు వాతావరణం కూడా అనుకూలించక పోవడంతో వేరుకుళ్లు, ఎండు తెగుళ్ల బారన పడి పంటంతా ఎర్రబారింది. పంట పూర్తిగా దెబ్బతినడంతో తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు రూ.20వేల ఖర్చు

శనగ సాగుకు ఎకరాకు రూ.20వేల వరకు ఖర్చు పెట్టామని రైతులు అంటున్నారు. వంద మంది దాకా కౌలు రైతులు ఎకరా రూ.8వేల ప్రకారం పంటను సాగు చేసి వారు మరింత నష్టపోయారు. విత్తనాలు సాగుకే ఎకరాకు రూ.5వేలు ఖర్చు అయిందని ఇప్పుడు దిగుబడి రాకపోవడంతో అగమ్యగోచరంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఎకరాకు 2 క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదు. దీంతో దరలు ఆశాజనకంగా ఉన్నా, దిగుబడి లేక పోవడంతో నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

దిగుబడి రాలేదు



పదెకరాల్లో శనగ పంట సాగు చేశా, ఎకరాకు రూ.20వేలు పెట్టుబడి పెట్టాను. అయితే దిగుబడి 2 క్వింటాళ్లు కూడా రాలేదు. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. - ఎర్రిస్వామి, రైతు, ఎం.అగ్రహారం

నివేదిక పంపాం



మండలంలో శనగ సాగుతో రైతులు నష్టపోయిన విషయాన్ని జిల్లా అధికారులకు కూడా నివేదిక పంపాం. పంట కోత ప్రయోగంలో ఎకరాకు 2 క్వింటాళ్లలోపే వచ్చింది. తుఫాన్ ప్రభావం వల్ల తెగుళ్ల సోకి పంట దెబ్బతింది. - రవి, ఏవో

కేఈ యువసేన కార్యవర్గం

మద్దికెర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కేఈ యువ సేన కార్యవర్గాన్ని ఆదివారం ఎపింక చేశారు. గౌరవాధ్యక్షుడిగా ఎడవలి గ్రామానికి చెందిన ఆకుల వేణుగోపాల్, అధ్యక్షుడిగా మద్దికెరకు చెందిన గడ్డం రామాంజులును ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మద్దికెరకు చెందిన పారా విలోభ, మదనంతపురం చెందిన ప్రసాద్, జనరల్ సెక్రటరీగా మహబూబ్ బాషా, కోశాధికారిగా బుల్లాపురం చంద్రశేఖర్, మెంబర్లుగా హనుమంతు, ఆకుల నాగరాజును ఎంపిక చేశారు. పంచాయతీ సభ్యులు జమేదార్ జంబునాథరాయుడు, గుడి ఎల్లప్ప అభినందించారు.



వేణుగోపాల్, గడ్డం రామాంజులు

ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థకు విరాళం

వెల్దుర్తి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి గ్రామానికి చెందిన వ్యాపారవేత్త ప్రశాంత్ ఆర్ట్ఆఫ్ లివింగ్ సంస్థకు రూ.40 లక్షల విలువ చేసే 18సెంట్ల స్థలం విరాళం అందజేశారు. ఆదివారం బెంగళూరులో వ్యవస్థాపకుడు రవిశంకర్‌కు అందజేశారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి


ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తుగ్గలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగు దేశంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. ఆదివారం మండలంలోని నల్లగుండ్లలో గ్రామానికి చెందిన కుశినేని శేఖర్ సొంత నిధులు రూ.8లక్షలతో నిర్మించిన గ్రామ ముఖద్వారాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామాల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మనోహర్ చౌదరి, తిరుపాల్ నాయుడు, నల్లగుండ్ల రవి, వెంకట్రాముడు చౌదరి, కొమ్మె వెంకటేశ్, బర్మా వీరేష్ మునేశ్వర్‌గౌడు, ప్రతాప్ యాదవ్, రామాంజనేయులు, రంగారెడ్డి, రాముడు, సత్యప్రకాష్ , స్థానికులు ఉన్నారు.

విద్యారంగ పరిరక్షణకు ముందుండాలి

ఆదోని అగ్రికల్చర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ పరిరక్షణలో ఏబీవీపీ ముందుండాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచించారు. ఆదివారం మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. విద్యార్థుల్లో జాతీయ భావాలు, ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి వీరేష్ మాట్లాడుతూ ఈనెల 24 నుంచి విశాఖపట్నంలో నిర్వహించే సభలకు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఉమేష్, గోవింద్ రాజ్ పాల్గొన్నారు.

నేడు ఆలూరులో జాబ్ మేళా

ఆలూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇబ్రహీం ఫంక్షన్ హాలులో పత్తికొండ ఎమ్మెల్యే రామాంజినేయులు, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ సహకారంతో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు దుర్గ ప్రసాద్, తిరుమలయ్య ఆదివారం తెలిపారు. పదో తరగతి నుంచి బీటెక్ చదివిన నిరుద్యోగులు అర్హులన్నారు. ఈ జాబ్‌మేళాలో 60 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు.

ఎస్సీల అభ్యున్నతికి కృషి


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మద్దికెర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల అభ్యున్నతికి కృషి చేస్తామని వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ గ్రామాల్లో చాలా మంది ఎస్సీలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలన్నారు. తనను ఎన్నుకున్నందుకు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా వైసీపీ అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.శ్రీదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గద్దల చంద్ర, హంపా హుశేన్, మల్లికార్జున, మీసేవా శేఖర్ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ భవన్‌ను స్వాధీనం చేయాలి

ఆలూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌ను స్వాధీనం చేయాలని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కొమ్ము రామాంజినేయులు డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ నాటి ఎమ్మెల్సీ మసాల పద్మజ ఆధ్వర్యంలో ఈ భవనాన్ని నిర్మించారన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే రామాంజనేయులు విన్నవించగా జడ్పీ అధికారులను ఆదేశించారని అన్నారు. ఈ భవనంలో కొనసాగుతున్న సచివాలయాలను సొంత భవనాల్లోకి మార్చాలన్నారు.

ఐఆర్ ప్రకటించాలి : ఏపీటీఎఫ్


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు రఘురామయ్య

ఆదోని అగ్రికల్చర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించడంలో ప్రభుత్వం జాప్యం చేయడం దారుణమని ఏపీటీఎఫ్ మాజీ ఉపాధ్యక్షుడు రఘురామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఏపీటీఎఫ్ నాయకుడు నూతలపాటి పరమేశ్వరరావు మూడో వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు, డీఏను వెంటనే చెల్లించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఆదోని, కౌతాళం, హొళాగుంద మండల నాయకులు మల్లికార్జున, రామన్న, శాంత కుమార్, గోపీ నాయక్, వెంకటేష్, రాఘవేంద్ర, సుదర్శన్ రెడ్డి, హనుమంతు రెడ్డి, బీరప్ప, లక్ష్మీనారాయణ, భాస్కర్, ఈరన్న పాల్గొన్నారు.

ఆదోని ఖ్యాతిని చాటాలి


ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, విట్టా రమేష్, మల్లప్ప

ఆదోని అగ్రికల్చర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ఆదోని ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటాలని ఎమ్మెల్యే పార్థసారథి సూచించారు. ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఫైనల్ విజేతగా నిలిచిన లెవెన్ ఐకాన్ జట్టుకు రూ.లక్ష, ట్రోఫీని, రన్నర్స్ ఫైర్ ఫైటర్‌కు రూ.యాభై వేలు, ట్రోఫీని అందజేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విట్టా రమేష్, జనసేన నాయకుడు మల్లప్ప మాట్లాడుతూ పట్టంలో నైపుణ్యంగల క్రీడాకారులు ఉండడం అభినందనీయమన్నారు. భారత మహిళా జట్టులో అంజలి శార్వాణి, రాష్ట్ర జట్టులో మరికొందరు వెటరన్ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారన్నారు. అవుట్డోర్, ఇండోర్ స్టేడియం నిర్మాణానికి సహకరిస్తానన్నారు. తాలూకా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ముజీబ్, వెల్లాల మధుసూదన్ శర్మ, శ్రీకాంత్ రెడ్డి, సూర్యనారాయణ, ఆర్‌ఆర్‌జీ రాజా గౌడ్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు ఈశ్వర్

పత్తికొండ టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆటోవర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసీ) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మధు, ఈశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సీఆర్ భవన్‌లో ఆటో వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం రాజప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఆటో కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి అవలం బిస్తున్నాయని, ఆర్టీవో, పోలీసుల వేధింపులు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు భీమలింగప్ప, ఏఐటీ యూసీ జిల్లా నాయకుడు కృష్ణ, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్న, ఆటో యూనియన్ నాయకులు రమేష్, బాషా, రఫీ, ఉచ్చన్న, రోగన్న, లక్ష్మన్న, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీవో లూక్ ఆదివారం తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త కటారుకొండ(ఓసీ)-1, ఆయా లక్షసాగరం (ఓసీ), సూదేపల్లె సెంటర్-2 (ఎస్సీ), మల్లెపల్లె సెంటర్-2(ఓసీ), సంగాల(బీసీ-ఏ), గూడెంపాడు(ఓసీ), లింగాలపల్లె (ఓసి), ఆలంకొండ(ఎస్సీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కార్యకర్త పోస్టుకు పదో తరగతి, ఆయా పోస్టుకు ఏడో తరగతి పాసై ఉండాలని స్థానికులై వివాహితురాలుగా ఉండాలని 21 సం.లు నిండి 35సం. లోపు వారు అర్హులన్నారు. 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు వెల్దుర్తి కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని తెలిపారు.

పత్తికొండ పరిధిలో..

పత్తికొండ టౌన్: టీచర్లు, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో లలిత పేర్కొన్నారు. ఆదివారం ప్రకటన విడుదల చేశారు. పత్తికొండ, తుగ్గలి మండలాల్లో కార్యకర్తల టీచర్ పోస్టు 1, ఆయాలు 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

ఆదోని రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసరకోడు గ్రామంలో తాగునీటి సమస్యపై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని జనసేన అధ్యక్షుడు తాహెర్ వలి అన్నారు. కొన్ని రోజులుగా గ్రామంలో తాగునీటి సమస్య ఉండటంతో ఆదివారం గ్రామ ప్రజలతో మాట్లాడారు.

వ్యక్తి అదృశ్యం


మల్లయ్య(ఫైల్)

మద్దికెర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చాకలివీధికి చెందిన చాకలి లక్ష్మి కుమారుడు మల్లయ్య(36) కనిపించడం లేదని తల్లి ఆదివారం ఎస్ఐ విజయకుమార్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. తల్లి లక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 16న తన కుమారుడు ఇంట్లో సెల్ పెట్టి వెళ్లాడని బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా కనిపించ లేదన్నారు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పార్టీ అభివృద్ధికి కృషి

హాలహర్వి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా కార్యదర్శిగా నియమితులైన అర్దగేరి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మాట్లాడుతూ తనకు గుర్తింపు ఇచ్చినందుకు ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షికి రుణపడి ఉంటానని తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

దేవనకొండ,జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కుక్కలు దాడి చేయడంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మెకానిక్ రాజశేఖర్ కుమారుడు ధర్మతేజగౌడ్(4) ఉదయం ఇంటి వద్ద నాయనమ్మ ముగ్గు వేస్తుండటంతో పక్కనే ఉన్నాడు. రెండు కుక్కలు అకస్మాత్తుగా వచ్చి దాడి చేశాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై బాలుడిని కాపాడారు. మెరుగైన వైద్యం కోసం బాలుడిని కర్నూలు వైద్యశాలకు తరలించారు.

కూటమితోనే చేనేతల అభివృద్ధి

ఆదోని టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే చేనేతల అభివృద్ధికి అవకాశం ఉందని ఎమ్మెల్యే పార్థసారధి అన్నారు. ఆదివారం ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పార్థసారధి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప ఆధ్వర్యంలో విడుదల చేశారు. సాకరే మారుతి రావు, కేజీ వీరన్న, సాకరే ఈరన్న, రసాలే గోవిందరావు, సాకరే లక్ష్మణ్, అర్కాట్ శివసాగర్, సాకరే శంకర్రావు, సాకరే గోపాలకృష్ణ, కామలే రాజు, పీసీ మహిపాల్ పాల్గొన్నారు.

ధ్యానానికి సమయం కేటాయించాలి

మద్దికెర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ధ్యానం చేయడానికి సమయాన్ని కేటాయించాలని వైద్యురాలు పుష్పావతి, హార్ట్‌ఫుల్ సంస్థ కోఆర్డినేటర్ ఫక్కీరప్ప అన్నారు. ఆదివారం వశిష్ట పాఠశాలలో ధ్యాన శిక్షణ నిర్వహించారు. మాధవిలత, పద్మనాభం, శ్యామలాకుమారి తదితరులు ఉన్నారు.

26న సమావేశం

ఆదోని టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ, మల్లికార్జున కళ్యాణం నిర్వహణకు 26వ తేదీన మహర్షి పాఠశాలలో సమావేశం నిర్వహించనున్నట్లు ఆలుకురు మఠం మహర్షి విజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ భక్తులు, పెద్దల సలహా, సూచనల మేరకు నిర్వహిస్తామని తెలిపారు.

న్యాయం చేయండి

మద్దికెర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నాయీ బ్రాహ్మణులకు న్యాయం చేయాలని సేవా సంఘం ఉపాధ్యక్షుడు ఎం.రంగస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం నాయీ బ్రాహ్మణ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివ, డైరెక్టర్ విజయకుమార్‌ను అభినందించారు.

ఆలయానికి విరాళం

మద్దికెర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం గ్రామ శివారులో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన అర్థిబోయిన ఉరుకుందప్ప, సుశీలమ్మ దంపతులు రూ.1.16 లక్షలు అందజేశారు.

దైవభక్తి అలవరచుకోవాలి


దర్గాలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

తుగ్గలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దైవభక్తి అలవరచుకోవాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఆదివారం మండలం నల్లగుండ్ల మునిస్వామి ఉరుసులో పూజలు నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు ప్రార్థనలు చేశారు. దైవమార్గాన్ని అనుసరిస్తే మానసిక ప్రశాంతత వస్తుందన్నారు. ఆలయాలు, దర్గాల అభివృద్ధికి టీడీపీ ముందు ఉంటుందన్నారు. మనోహర్ చౌదరి, తిరుపాల్ నాయుడు, వెంకట్రాముడు చౌదరి, నల్లగుండ్ల రవి, మునేశ్వర్‌గౌడు, ప్రతాప్ యాదవ్, రామాంజనేయులు, రంగారెడ్డి ఉన్నారు.

అమిత్ షా గోబ్యాక్



నినాదాలు చేస్తున్న వామపక్ష నాయకులు

ఆదోని రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా గోబ్యాక్ అంటూ వామ పక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో ఆందోళన చేశారు. అమిత్ షాపర్యటనను వ్యతిరేకిస్తూ, అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాకు రాష్ట్రంలో తిరిగే అర్హత లేదని, కేంద్ర ప్రభుత్వం వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు అజయ్ బాబు, లక్ష్మన్న, ఈరన్న, వెంకప్ప, గోపాల్, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఆదోని రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైచిగేరిలో కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ మహదేవా ఆధ్వర్యంలో 125 మందికి పైగా బీపీ, రక్త, గుండె, టూడీ ఎకో పరీక్షలను నిర్వహించినట్లు వైద్యులు అన్నపూర్ణ, సందీప్ కుమార్ తెలిపారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. నలుగురు గుండె జబ్బుతో బాధ పడుతున్నారని, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేస్తామన్నారు.

అనధికార కట్టడం కూల్చివేత

ఆదోని టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేడీ కాలనీ రెండో రోడ్డులో అనుమతికి విరుద్ధంగా నిర్మించిన నిర్మాణంలోని కొంత భాగాన్ని మున్సిపల్ అధికారులు ఆదివారం కూల్చి వేశారు. ఖాళీ స్థలంలో ఆర్‌సీసీ స్లాబ్ వేయడంతో చర్యలు తీసుకున్నారు. యజమానులు అనుమతి పొందిన ప్లానుకు విరుద్ధంగా నిర్మాణాలు చేయరాదని, సెట్‌బ్యాక్ పాటించాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణ సింగ్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బాల మద్దయ్య సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదోని రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆదోని - ఎమ్మిగనూరు బైపాస్‌లోని నెట్టేకల్లు క్రాస్ వద్ద బైక్ అదుపు తప్పి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల మేరకు.. మండలంలోని దణాపురం గ్రామానికి చెందిన ఎర్రిస్వామి, గోవర్ధన్ బైక్‌పై ఎమ్మిగనూరు జాతరకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నెట్టేకల్లు క్రాస్ వద్ద ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన డ్రమ్ములను ఢీకొట్టి ఇరువురు గాయపడి, రక్తస్రావమై పడిపోయారు. స్థానికులు క్షతగాత్రులను ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అరికెర రోడ్డులో అవస్థలు


ఇరుకుగా ఉన్న అరికెర రోడ్డు

ఆలూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అరికెర రహదారి ఇరుకుగా మారింది. రోడ్డుకు రెండువైపులా అనధికారికంగా బంకులు వేయడంతో రోడ్డు ఇరుకుగా మారి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌కు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. బస్సుల రాకపోలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంచాయతీ, పోలీసు అధికారులు స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

మండలాన్ని అభివృద్ధి చేస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ


హాలహర్వి ఎంపీడీవో వరలక్ష్మి

హాలహర్వి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు.

ప్రశ్న: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు ఎలా ఉంది?
జవాబు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకున్నాం.
ప్రశ్న: సచివాలయ సిబ్బంది పనితీరు ఎలా ఉంది?
జవాబు: మండలంలోని 15 సచివాలయాలు ఉండగా, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. 150మందికి గాను 40మాత్రమే ఉన్నారు. అందులో చాలా మంది సెలవుల్లో ఉన్నారు.
ప్రశ్న: సిబ్బంది కొరతతో ఇంటింటి సర్వేలు, పింఛన్ల పంపిణీలో సమస్యలు వస్తున్నాయా?
జవాబు: ఉన్న సిబ్బందికే అదనపు బాధ్యతలు అప్పగించాం. అవసరమైన సిబ్బందిని నియమించాలని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.
ప్రశ్న: మండలానికి నిధులు వచ్చాయా?
జవాబు: ఉపాధి నిధులు రూ.2కోట్ల నిధులు వచ్చాయి. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించాం.
ప్రశ్న: పంచాయతీలకు నిధులు వచ్చాయా?
జవాబు: ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి. వాటిని సర్పంచులు తాగునీటి పథకాల కోసం ఖర్చు చేశారు.
ప్రశ్న: వేసవిలో తాగునీటి సమస్యను తీర్చేందుకు చర్యలు తీసుకున్నారా?
జవాబు: బాపురం, చింత కుంట, విరుపాపురం జలాశయాల ద్వారా తాగునీటి సమస్య లేకుండా చూస్తాం.
ప్రశ్న: వలసల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
జవాబు: ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తాం. అడిగిన వారిందరికీ పనులు చూపిస్తాం.

లారీ బోల్తా.. ముగ్గురికి గాయాలు


రోడ్డు సైడు కాలువలోకి దూసుకెళ్లి బోల్తాపడిన లారీ

మంత్రాలయం జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం సమీపంలో లారీ, ఆటోను తప్పించబోయి బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాల మేరకు కర్ణాటకలోని కొప్పల్‌కు చెందిన లారీ మాధవరం స్టీల్ ఫ్యాక్టరీ నుంచి లోడుతో వెళ్తుండగా.. ఆటోను తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న మురుగు కాలువలోకి అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న బెంగుళూరు చెందిన ముగ్గురు భక్తులతో పాటు ఆటో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మాధవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. లారీ రోడ్డుపక్కన కాలువలో బోల్తా పడటం, ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని స్థానికులు చర్చించుకున్నారు. లారీ, ఆటో దెబ్బతిన్నాయి. మాధవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోల వల్లే ట్రాఫిక్‌కు అంతరాయం


ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ పరమేష్ నాయక్

మంత్రాలయం జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో రద్దీ సమయాల్లో ఆటోల వల్లే ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ఎస్ఐ పరమేష్‌నాయక్ అన్నారు. ఆదివారం సాయంత్రం సీఐ రామాంజనేయులుతో కలిసి ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఆటోలు, ప్రధాన రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాలను క్లియర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటోలు ఇష్టారాజ్యంగా నడపడం వల్లనే ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. రద్దీ సమయాల్లో భక్తులకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు పాటించాలని తెలిపారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో సిబ్బంది జమీర్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి19(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎర్రకోట రహదారిలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను పాటించడంతో పాటు వాహనాలకు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలన్నారు. ఆటో, ట్యాక్సీ, బొలెరో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను, లోడ్‌తో ప్రయాణిస్తే చర్యలు తప్పవన్నారు. 25 వాహనాలకు జరిమానా విధించారు. తనిఖీల్లో హెచ్‌సీ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రాష్ట్ర పర్యటనను అమిత్‌షా విరమించుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి19(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడిన హోంశాఖ మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనను విరమించుకోవాలని వామ పక్ష పార్టీల నాయకులు సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసి నాయకులు భాస్కర్‌యాదవ్, రాముడు, ప్రసాద్, తిమ్మగురుడులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో గోబ్యాక్..గో బ్యాక్ అమిత్‌షా అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో కార్పొరేట్ సంస్థలైన అంబానీ, ఆదానీలకు ఊడిగం చేస్తూ భారత రాజ్యాంగాన్ని తిరిగి రాయాలని చూడడం దుర్మార్గమైన చర్య అన్నారు. అంబేడ్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడడం సరైంది కాదని, తక్షణమే అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జబ్బార్, మహేంద్రబాబు, సమీఉల్లా, విజయేంద్ర, ఖాజా, రవి, ఇస్మాయిల్, బాషా, యల్లప్ప, వీరేష్ పాల్గొన్నారు.

కార్మిక సదస్సును జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.లింగన్న

కోసిగి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆదోనిలోని భవసార కళ్యాణమండపం పాండురంగస్వామి దేవాలయం సమీపంలో ఈ నెల 28న వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కె.లింగన్న పిలుపునిచ్చారు. ఆదివారం కోసిగిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతంలో వ్యవసాయ కూలీలు సన్నకార, చిన్న రైతులకు వ్యవసాయ పనులు లేక బతుకుతెరువు కోసం పిల్లాపాపలతో సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్, సీఐటీయు మండల కార్యదర్శి రాముడు, చిన్నన్న, గోపాల్ పాల్గొన్నారు.

బాలుడి ఆచూకీ లభ్యం


తల్లి ఒడికి చేరిన బాలుడు రామ్‌చరణ్

ఎమ్మిగనూరు టౌన్,జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నీలకంఠేశ్వర స్వామి జాతరలో తప్పిపోయిన బాలుడి దొరికాడు. శుక్రవారం సాయంత్రం రామ్‌చరణ్ వయస్సు(5) అనే బాలుడు తప్పిపోయినట్లు పట్టణ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దాంతో స్పందించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని ఆదివారం బాలుడి ఆచూకీ కనుగొనట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలుగా విడిపోయి, సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా బాలుడి ఆచూకీ కనుగొన్నారు. దేవనకొండ మండలం పుల్లాపురం గ్రామానికి చెందిన మాదిగ మునిస్వామి అనే వ్యక్తి బాలుడిని తీసుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులు కేసును 24గంటలలోపే ఛేదించడంతో పలువురు ప్రశంసించారు.

ఐరన్‌బండ రహదారి గుంతల మయం



గోనెగండ్ల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలం ఐరన్ బండ, ఎన్నెకండలకు వెళ్లే రహదారి గుంతలు పడి రాళ్లు తేలి అధ్వానంగా మారింది. రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికి ఫలితం లేకుండా పోయిందని పలువురు గ్రామస్థులు వాపోతున్నారు. రహదారి మొత్తం గుంతలు పడటంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోల రాక పోకలకు ఇబ్బందిగా మారింది. ఈ గ్రామాల విద్యార్థులు చదువుకునేందుకు గోనెగండ్లకు రావాల్సి ఉండటంతో సైకిళ్లు, ద్విచక్రవాహనలు, ఆటోలు మరమ్మతులకు గురవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ముగిసిన అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

- సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి అనంతపురం వృషభాలు
- చివరి రోజు పోటీల్లో పాల్గొన్న అఖండ సినిమాలోని వృషభం బసవ
- పోటీలను తిలకించేందుకు తరలి వచ్చిన జనం




చెట్టుపై నుంచి పోటీలను తిలకిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు , జనవరి19(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర జాతర సందర్భంగా నాలుగు రోజుల నుంచి పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో జరుగుతున్న అంతర్రాష్ట్ర ఎద్దుల బండలాగుడు పోటీలు ఆదివారంతో ముగిశాయి. పోటీల్లో ఆయా రాష్ట్రాల నుంచే గాక వివిధ జిల్లాల నలుమూలల నుంచి పాలపళ్ల సైజు, న్యూ కేటగిరి, సీనియర్ విభాగాల్లో వృషభాలు పాల్గొని తమ సత్తాను చాటాయి. చివరి రోజు ఆదివారం అనంతపురం, నంద్యాల, కర్నూలు, కడప జిల్లాల నుంచి ఎనిమిది జతల ఎద్దులు పోటీలో పాల్గొన్నాయి. ఇందులో అఖండ సినిమాలో బాలయ్యతో పాటు నటించిన ఎద్దు (బసవ) పాల్గొనడంతో పోటీలో ఆకర్షణగా నిలిచాయి. ఈ పోటీల్లో అనంతపురం జిల్లా ఎ.నారాయణపురం గ్రామానికి చెందిన మహ్మద్‌ఫరీద్‌కు చెందిన ఎస్‌టీఆర్ బుల్స్ ఎద్దులు నిర్ణీత సమయంలో(20నిమిషాల్లో) 2,830.3 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.లక్ష బహుమతిని కైవసం చేసుకున్నాయి. అలాగే నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా జేన్ మండలం ధర్మవరానికి చెందిన ఏపీసీడ్స్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి వృషభాలు నిర్ణీత సమయంలో 2,822.3 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతి రూ.75వేలను దక్కించుకోగా, కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన మార్తల చంద్ర ఓబుల్‌రెడ్డి ఎద్దుల 2,447.5 అడుగుల దూరాన్ని లాగి తృతీయ బహుమతి రూ.50వేలు గెలుచుకున్నాయి. అనంతపురం జిల్లా గార్లదిన్నె గ్రామానికి చెందిన కుమ్మరి రామాంజనేయుల వృషబాలు 2,430.3 అడుగుల దూరాన్ని లాగి నాల్గవ స్థానంలో నిలిచి రూ.30వేలు, కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన మార్తల రామ సుబ్బమ్మ వృషభాలు ఐదవ స్థానంలో నిలిచి రూ.20వేలను కైవసం చేసుకున్నాయి. అలాగే పోటీల్లో పాల్గొని బహుమతిని సాధించని మూడు జతల వృషబాల యజమానులకు ఒకొక్కరికి రూ.10వేల చొప్పున కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. ఇందులో మొదటి బహుమతిని రైతు నేస్తం యూట్యూబర్ తరఫున జయంత్‌బాబు రూ.లక్ష నగదును అందజేయగా, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ బహుమతులను పట్టణానికి చెందిన వ్యాపారులు, జిన్నింగ్ ఫ్యాక్టరీ యజమానులు, రైస్‌మిల్లర్లు అందజేశారు. పోటీల్లో వ్యాఖ్యాతలుగా సాయినాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, చిరంజీవి ఆకట్టుకున్నారు. అలాగే బండలాగుడు దూరాన్ని పీతటి లక్ష్మన్న కొలతలు వేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు భాస్కర్, అప్పాబజార్ శేఖర్, కడిమెట్ల విరుపాక్షిరెడ్డి, మహేంద్రబాబు, మురళీకృష్ణారెడ్డి, రాందాసుగౌడు, కందనాతి కేశన్న, రైస్‌మిల్ నారాయణరెడ్డి, నర్సింగరావు, తురేగల్ నజీర్, చంద్రశేఖరరెడ్డి, వాల్మీకి శంకరయ్య, నరసింహులు, ముగతి ఈరన్నగౌడు, సోమేశ్వరరెడ్డి, జగ్గాపురం ఈరన్న, నజీర్, బడేసా పాల్గొన్నారు.


బండలాగుడు పోటీల్లో మొదటి బహుమతి రూ.లక్ష అందుకుంటున్న అనంతపురం జిల్లా ఎ.నారాయణపురం వృషభాల యజమాని మహమ్మద్‌ఫరీద్


బండలాగుతున్న ఒంగోలు జాతి ఎద్దులు

రజకులు అన్ని రంగాల్లో రాణించాలి

- కూటమి ప్రభుత్వంలో పెద్దపీట
- రజక సంఘం కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి


కోసిగిలో రజకుల దోబీఘాట్లను పరిశీలిస్తున్న రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి

కోసిగి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రజకులు కులవృత్తితో పాటు వ్యాపార, రాజకీయ అన్ని రంగాల్లో రాణించి అభివృద్ధి వైపు అడుగులు వేయాలని రజక సంఘం కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి అన్నారు. ఆదివారం కోసిగిలోని 9వ వార్డులో సజ్జలగుడ్డం రోడ్డులో ఉన్న దోబీ ఘాట్‌ను పరిశీలించారు. అనంతరం సావిత్రి మాట్లాడుతూ కోసిగితో పాటు ఆదోని, ఎమ్మిగనూరు మండలాల్లో ఉన్న దోబీ ఘాట్లను పరిశీలించానన్నారు. అందులో భాగంగానే కోసిగిలోని రజకుల సమస్యలు తెలుసుకున్నామన్నారు. మండలంలో దాదాపు రెండు వేల నుంచి మూడువేల జనాభా కలిగి ఉన్నారని, రజక వృత్తిని రెండు వేల మంది నేటికీ చేస్తూ జీవిస్తున్నారన్నారు. రజకులకు సరైన సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2014లో నాటి టీడీపీ ప్రభుత్వం ఘాట్ల నిర్మాణానికి నిధులు కేటాయించిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు నిధులు రాలేదన్నారు. ప్రస్తుతం ఉన్న దోబీఘాట్లు నిరూపయోగంగా మారి శిథిలావస్థకు చేరాయన్నారు. రజక కులస్థుల్లో కూడా చాలా మంది విద్యావంతులు ఉన్నారని, వారిని దృష్టిలో పెట్టుకుని స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇచ్చి తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల రజక కులస్థులు బసన్న, వేమారెడ్డి, వీరన్న, విరుపాక్షి, మూర్తి, శివ, విజయ్, తదితరులున్నారు.


కోసిగి మీదుగా వలస వెళ్తున్న ఆయా గ్రామాల కూలీలు

గ్రామాలు ఖాళీ

- ఒకే రోజు 800 వందల కుటుంబాలు వలస
- సుమారు వంద వాహనాల్లో గుంటూరు, కర్ణాటకలకు ప్రయాణం


కౌతాళం నుంచి వలస వెళ్తున్న కూలీలు

కోసిగి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ముగిసిన నాటి నుంచి వారం రోజులుగా కోసిగి మండలం నుంచి వలసలు అధికమవుతున్నాయి. వృద్ధులను ఇంటి దగ్గర కూర్చోబెట్టి ఆదివారం ఒక్క రోజే సుమారు 800 కుటుంబాలకు పైగా దాదాపు వంద ప్రైవేటు వాహనాల్లో వలసబాట పట్టారు. ఇప్పటికే కోసిగి మండలం నుంచి సుమారు ఐదువేల కుటుంబాలకు వలసబాట పట్టాయి. ఆదివారం మండల కేంద్రమైన కోసిగితో పాటు మూగలదొడ్డి, ఆగసనూరు, కోల్‌మాన్‌పేట, దుద్ది, చింతకుంట, చిర్తనకల్, అగసనూరు, సాతనూరు, జుమాలదిన్నె, కామన్‌దొడ్డి, బెళగల్, జంపాపురం, సజ్జలగుడ్డం, ఐరంగల్, కడిదొడ్డి గ్రామాల నుంచి పెద్దఎత్తున రైతు కూలీలు ప్రత్యేకవాహనాల్లో పిల్లాపాపలతో కలిసి మూటముల్లె సర్దుకుని గుంటూరు, కర్ణాటకలోని దేవదుర్గ, తెలంగాణకు పత్తి, మిరప పనుల కోసం వలసబాట పట్టారు. రోజురోజుకు పశ్చిమ ప్రాంతం కోసిగి మండలంలో వలసలు అధికమయ్యాయి. అధికారులు తూతూమంత్రంగా వచ్చి పనులు కల్పిస్తామని చెప్పారని, ఆచరణలో మాత్రం వలసలను నివారించడంలో విఫలమయ్యారని పలువురు చెబుతున్నారు. వలస కూలీలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో చదవుకుంటున్న పిల్లలను సైతం తల్లిదండ్రులు వెంట పెట్టుకుని తీసుకెళ్తున్నారు.

కౌతాళం : మండలం నుంచి దాదాపు 200కు పైగా కుటుంబాలు బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి పట్టణాలకు వలస పోయాయి. మండల కేంద్రమైన కౌతాళంలోని ఎన్టీఆర్ నగర్, మండల పరిధిలోని లక్ష్మీనగర్, దొమ్మలదిన్నె, కాత్రికి, అగసలదిన్నె ఉరుకుంద గ్రామాల నుంచి 200పైగా కుటుంబాలు లారీలు, బొలెరో, టెంపో వాహనాల్లో బయలుదేరారు. దాంతో గ్రామాలు జనాలు లేక బోసిపోతున్నాయి. మండలంలో ఇంతగా వలసలు పోతున్నా అధికారులు మాత్రం కనీసం నివారించడంలో విఫలమైనట్లు విమర్శలు వస్తున్నాయి. కనీసం గ్రామాల్లో వలసల నివారణకు అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టలేకపోతున్నారన్న పలువురు అభిప్రాయపడుతున్నారు.

పెద్దకడుబూరు: నిత్యం ఏదో ఒక ఊరు నుంచి లారీల్లో ప్రజలు వలసలు వెళ్తున్నారంటే కరువు ఏపాటిగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆదివారం పీకలబెట్ట గ్రామం నుంచి దాదాపుగా 50 కుటుంబాలు లారీలో గుంటూరుకు పిల్లాపాపలతో వలసవెళ్లిపోయారు. ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి పనులు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కూలీలకే సరి

- గిట్టుబాటు ధర లేని చెవలకాయ
- స్థానిక మార్కెట్‌లో 10 కేజీల ప్యాకెట్ రూ.110
- పెట్టుబడి రాక రైతు విలవిల


చెవల కాయలను కోస్తున్న కూలీలు



గోనెగండ్ల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కూరగాయలలో చెవలకాయలకు ఒక ప్రత్యేక స్థానం ఉన్నది. అయితే ఈ చెవలకాయ పంటను గోనెగండ్ల మండలంలో దాదాపు 200 ఎకరాల్లో పండిస్తున్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని, కూలీలకే సరిపోతున్నాయని, రవాణా ఖర్చులు నెత్తిన పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఎకరానికి రూ. 20 వేలు పెట్టుబడి పెట్టామని, అయితే ప్రస్తుతం ఉన్న ధరలు గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు. పంట వారానికి ఒకసారి కోతకు వస్తుందని, 25 మంది కూలీలు అవసరం కాగా, ఒక్క కూలీలకి రూ. 300 ప్రకారం ఇవ్వాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే స్థానిక మార్కెట్‌లో 10 కేజీ ప్యాకెట్ కేవలం రూ. 110 ధర పలుకుతుందని వాపోతున్నారు. ఇక ఇక్కడి నుంచి హైదరాబాద్, తెలంగాణలోని పలు జిల్లాలకు తరలించేందుకు రవాణా ఖర్చులు 10 కేజీ ప్యాకెట్‌కు రూ. 100 ఇవ్వాల్సి వస్తుందని, అక్కడ మార్కెట్‌లో రూ. 250 నుంచి రూ. 300 లోపు ధర ఉంటుందన్నారు. వారానికి ఐదు నుంచి ఎనిమిది ప్యాకెట్లు పంట దిగుబడి వస్తుందని, పండిన పంట మొత్తం కూలీలకు, పెట్టుబడికి, రవాణ ఖర్చులకే సరిపోతున్నాయని చేతికి ఏమీ మిగలడం లేదని రైతులు తలలు పట్టుకుంటున్నారు.

వెండి గజ వాహనంపై ప్రహ్లాదరాయలు


వెండి గజవాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి గజవాహనంపై బంగారు అంబారిలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం పుష్యమాసం పంచమి శుభదినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారిలో వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి పీఠాధిపతి మహామంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

రాఘవరాయుడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ



వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. ఆదివారం పంచమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

కబడ్డీ పోటీల్లో విజేత ప్యాపిలి


ఫుట్‌బాల్ ఆటగాళ్లను పరిచయం చేసుకుంటున్న వాల్మీకి సంఘం నాయకురాలు సంజీవ లక్ష్మి

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఎమ్మెల్యే బీవీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా పట్టణంలోని స్థానిక మాచాని బాలికల ఉన్నత కళాశాల ఆవరణంలో అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి జరిగిన ఫైనల్‌లో ప్యాపిలి, దైవందిన్నె జట్లు పోటీ పడగా ప్యాపిలి జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్‌లో గెలిచిన జట్టుకు టీడీపీ నాయకుడు అప్పా బజార్ శేఖర్ నగదు రూ. 60,000తో పాటు ట్రోఫీని అందజేశారు. రన్నర్స్ జట్టుకు నగదు రూ. 40000తో పాటు ట్రోఫీని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ కబడ్డీ పోటీలను విజయవంతంగా ముగించిన కమిటీ సభ్యులను అభినందించారు. అంతకు ముందు వాల్మీకి సంఘం నాయకురాలు బి సంజీవ లక్ష్మీ ఫుట్‌బాల్ ఆటగాళ్లను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో బందె నవాజ్, అల్‌ఫ్రెడ్‌రాజు, మాల రాజేష్, నర్సన్నగౌడ్ పాల్గొన్నారు.

కార్యకర్తకు టీడీపీ నాయకుడి పరామర్శ


కార్యకర్త ఆరోగ్య స్థితిని తెలుసుకుంటున్న మాజీ ఎంపీటీసీ

కౌతాళం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కౌతాళం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త అద్దాల రవి అనారోగ్యంతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ, టీడీపీ నాయకుడు సొద్ది బసవరాజు ఆదివారం కర్నూలు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. రవి త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.